# దేవుని భూ వాగ్దానం

"అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల సంతతివారికి భూమి సదాకాలం చెందుతుందని దేవుడు వాగ్దానం చేయలేదా?" అనే ప్రశ్న వస్తుంది.

కల్దీయుల ఊరు అనే పట్టణంనుండి, కొద్ది కాలం హారానులో ఆగి, కనానుకు (ప్రస్తుతపు ఇశ్రాయేలుకు) ప్రయాణం చేసిన తరువాత అబ్రాహాముకు అతని సంతానానికి దేవుడు చేసిన భూ వాగ్దానం మొదటిగా ప్రస్తావించబడింది. ఆ సమయంలో దేవుడు అబ్రాహాముతో యిలా అన్నాడు: "నీ సంతానమునకు ఈ దేశ మిచ్చెదనని చెప్పగా" (ఆది. 12:7బి).

అబ్రాహాము దేశంలో గట్టిగా స్థిరపడినప్పుడు, దేవుడు అతనితో యిలా అన్నాడు: "–ఇదిగో నీ కన్నులెత్తి నీవు ఉన్న చోటనుండి ఉత్తరపుతట్టు దక్షిణపుతట్టు తూర్పుతట్టు పడమరతట్టును చూడుము; ఎందుకనగా నీవు చూచుచున్న యీ దేశమంతటిని నీకును నీ సంతానమునకును సదాకాలము ఇచ్చెదను" (ఆది. 13:14బి, 15; ద్వితీయో. 12:1 చూడు). తరువాత ఆ వాగ్దానాన్ని దేవుడు నిబంధనగా చేశాడు. అందులో ఆయన దిక్కులను నిర్వచించాడు. సంఖ్యా. 34:2–12లో మోషే హద్దులను ఎక్కువ వివరాలతో నిర్వచించాడు. అందులో ఉన్న పది కనాను దేశాలు చేర్చబడ్డాయి: "ఆ దినమందే యెహోవా – ఐగుప్తు నది మొదలుకొని గొప్ప నదియైన యూఫ్రటీసు నదివరకు ఈ దేశమును, ... నీ సంతానమున కిచ్చియున్నానని అబ్రాముతో నిబంధన చేసెను" (ఆది. 15:18). సొలొమోను సామ్రాజ్యం ఈ భూ భాగమంతటిని కలిగియుంది. "యూఫ్రటీసు మొదలుకొని ఐగుప్తు సరిహద్దువరకు ఈ మధ్యనున్న రాజ్యములన్నిటి మీదను ఫిలిష్తీయుల దేశమంతటి మీదను సొలొమోను ప్రభుత్వము చేసెను" (1 రాజులు 4:21ఎ).

దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానం ఇస్సాకుకు (ఆది. 26:3, 4) మరియు యాకోబుకు అతని సంతానానికి యిస్తానన్నట్టు తిరిగి చెప్పబడింది (ఆది. 28:13; 35:12). సంవత్సరాలు గతించిన పిమ్మట, వారి సంతానం ఐగుప్తు విడిచిన తరువాత, దేవుడు ఇశ్రాయేలుకు ఆ భూమిని వాగ్దానం చేశాడు (నిర్గమ. 6:4, 8).

యెహోషువ నాయకత్వం ద్వారా, ఇశ్రాయేలీయులు దేశాన్ని జయించి, అందులో స్థిర నివాసాలను ఏర్పరచుకున్నారు. యెహోషువ పని సంపూర్ణమైనప్పుడు, దేవుడు తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడని చదువుతాము:

> యెహోవా ప్రమాణము చేసి వారి పితరుల కిచ్చెదనని చెప్పిన దేశమంతయు ఆయన ఇశ్రాయేలీయుల కప్పగించెను. వారు దాని స్వాధీనపరచుకొని దానిలో నివసించిరి (యెహోషువ 21:43).

> మీ దేవుడైన యెహోవా మీ విషయమై సెలవిచ్చిన మంచి మాటలన్నిటిలో ఒక్కటియైనను తప్పియుండలేదని మీరు అనుభవ పూర్వకముగా ఎరుగుదురు; అవి అన్నియు మీకు కలిగెను, వాటిలో ఒక్కటియైనను తప్పియుండలేదు (యెహోషువ 23:14బి)
> .

భూమి ఇశ్రాయేలుయులకు యిచ్చినా, దాన్ని పొందడం, దానిలో వారు నిలిచి యుండడం అనేది, దేవునికి, ఆయన ఆజ్ఞలకు వారు చూపే సరియైన గౌరవం మీద ఆధారపడియుంటుంది:

> నేడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును నేను నీ యెదుటను ఉంచి, భూమ్యాకాశములను మీమీద సాక్షులుగా పిలుచుచున్నాను. నీ పితరులైన అబ్రాహాము ఇస్సాకు యాకోబులకు ఆయన ప్రమాణము చేసిన దేశములో మీరు నివసించునట్లు యెహోవాయే నీ ప్రాణమునకును నీ దీర్ఘాయుస్సుకును మూలమై యున్నాడు. కాబట్టి నీవును నీ సంతానమును బ్రదుకుచు, నీ ప్రాణమునకు మూలమైన నీ దేవుడైన యెహోవాను ప్రేమించి ఆయన వాక్యమును విని ఆయనను హత్తుకొనునట్లు జీవమును కోరుకొనుడి (ద్వితీయో. 30:19, 20).

ఐగుప్తునుండి బయటికి వచ్చిన తరమువారిలో – అంటే భూ వాగ్దానం చేయబడిన వారి తరములో (నిర్గమ. 6:8; 12:25; ద్వితీయో. 9:23) – భూమిని కొంత భాగం పొందినవారు యిద్దరే (సంఖ్యా. 32:9–12; ద్వితీయో. 1:35, 36; యెహోషువ 5:6). దేవుడు తమకు చేయ నాజ్ఞాపించినది ఇశ్రాయేలు చేయని పక్షంలో, ఇశ్రాయేలీయుల ఎదుట పారద్రోలిన దేశముల వారికి ఆయన ఏమి చేశాడో, ఇశ్రాయేలీయులకును ఆయన అదే చేస్తాడు (సంఖ్యా. 33:55, 56): ఆయన భూమిని వారి యొద్దనుండి తీసివేస్తాడు.

షరత్తులననుసరించి ఆ భూమి ఇశ్రాయేలీయులది. ఆదికాండం 13:15లో, "ఈ దేశమంతటిని నీకును నీ సంతానమునకును సదాకాలము ఇచ్చెదను" అని దేవుడు చెప్పాడు. ఏదియెలాగున్నా, వాగ్దానంలో "సదాకాలము" అనేదానికి హెబ్రీలో *olam* అంటే "కొనసాగింపబడుతూ" అని అర్థం; కాని "నిత్యము" అయ్యుండనవసరం లేదు. " 'నీ తరువాత నీ సంతానమునకు ఈ దేశమును నిత్య స్వాస్థ్యముగా ఇచ్చెదనని సెలవిచ్చెను' " (ఆది. 48:4బి; నిర్గమ. 32:13 కూడా చూడు). అయితే ఆ మాట "నిత్యము" అని కూడా తర్జుమా చేయబడింది.

*Olam* అనే పదానికి "అంతములేని" అనే భావం ఉండనవసరం లేదు. కొన్ని ఉదాహరణలు ఈ విషయాన్ని స్పష్టపర్చుతాయి.

(1) ఇదిగో నేను నీతో మాటలాడునప్పుడు ప్రజలు విని "నిరంతరము" (*olam*) నీయందు నమ్మకముంచుదురు (నిర్గమ. 19:9). దానికి తరువాత వెంటనే ప్రజలకు అతని మీద నమ్మకం తొలిగిపోయింది. వేరొక నాయకుని నియమించుకోవాలని వారు కోరుకున్నారు (సంఖ్యా. 14:4).

(2) తన యజమానునియందు ఆనందించు హెబ్రీ దాసుడు "నిరంతరము" వానికి దాసుడై ఉంటాడు (*olam*; నిర్గమ. 21:6). మరణానంతరము దాసుడు తన

యజమానునికి సేవచేయదు (యోబు 3:19).

(3) అహరోను కుమారుల యొక్క యాజకత్వం “నిరంతరముండాలి” (*olam*; నిర్గమ. 40:15). యాజకులు మార్చబడినట్టు క్రొత్త నిబంధన చెప్తుతోంది (హెబ్రీ. 7:12–14).

(4) బలి సంబంధమైన అర్పణలు “నిరంతరం” అర్పింపబడాలి (*olam*; లేవీయ. 6:18). ఏదియెలాగున్నా, ఆ అర్పణలు యిప్పుడు అర్పింపబడలేదు. “అవి కేవలం రాబోవుచున్న వాటి ఛాయయే” (హెబ్రీ. 10:1–4).

ఇలా అనేక ఉదాహరణలు యివ్వవచ్చు. వారు దేవునికి విధేయులైయున్నంతకాలం ఆ భూమి వారిదే ఔతుంది. ఏదియెలాగున్నా, వారు దేవునికి అవిధేయులై వారి “దేశంనుండి తుంచివేయబడతారని” మోషే ఇశ్రాయేలీయులతోనే అన్నాడు (ద్వితీయో. 28:63బి).

నిబంధనను భంగం చేసినందుకు దేవుడు ఇశ్రాయేలీయులను శిక్షిస్తానని మాట యిచ్చినా, వారిని మాత్రం పూర్తిగా నాశనం చేయనని వాగ్దానం చేశాడు.

> అయితే వారు తమ శత్రువుల దేశములో ఉన్నప్పుడు వారిని నిరాకరింపను; నా నిబంధనను భంగపరచి వారిని కేవలము నశింపజేయునట్లు వారియందు అసహ్య పడను. ఏలయనగా నేను వారి దేవుడనైన యెహోవాను. నేను వారికి దేవుడనై యుండునట్లు వారి పూర్వికులను జనముల యెదుట ఐగుప్తులోనుండి రప్పించి వారితో చేసిన నిబంధనను ఆ పూర్వికులనుబట్టి జ్ఞాపకము చేసికొందును … (లేవీయ. 26:44, 45).

అలా ఎందుకు జరిగిందో జనములే ఆశ్చర్యపోతారని దేవుడు ముందుగా సూచించాడు:

> –యెహోవా దేని బట్టి యీ దేశమును ఇట్లు చేసెనో? యీ మహా కోపాగ్నికి హేతువేమో? అని చెప్పుకొందురు. మరియు వారు – వారి పితరుల దేవుడైన యెహోవా ఐగుప్తు దేశములోనుండి వారిని రప్పించిన తరువాత ఆయన తమతో చేసిన నిబంధనను వారు నిరాకరించిరి (ద్వితీయో. 29:24, 25).

నిబంధన షరత్తులను అనుసరించి దేవుడు ఇశ్రాయేలుకు వ్యతిరేకంగా పని చేశాడు; ఆయన వారిని శిక్షించాడు. దేవుని హెచ్చరికలు ఎన్ని ఉన్నా, ఈ శిక్ష కూడా ఇశ్రాయేలును దేవుని వైపుకు మరల్చలేకపోయింది. దేవుడు యిర్మీయాతో యిలా మాట్లాడాడు:

> అయినను వారు తమ దుష్ట హృదయములో పుట్టు మూర్ఖతచొప్పున నడుచుచు వినకపోయిరి; చెవియొగ్గినవారు కాకపోయిరి, వారు అనుసరింపవలెనని నేను వారి కాజ్ఞాపించిన యీ నిబంధన మాటలన్నిటి ననుసరించి నడువలేదు గనుక నేను ఆ నిబంధనలోని వాటినన్నిటిని వారిమీదికి రప్పించుచున్నాను. … వారు నా మాటలు విననొల్లకపోయిన తమ పితరుల దోష చర్యలను జరుప తిరిగియున్నారు; మరియు వారు అన్య దేవతలను పూజించుటకై వాటిని అనుసరించుచు, వారి పితరులతో నేను చేసిన నిబంధనను ఇశ్రాయేలు వంశస్థులును యూదావంశస్థులును భంగము చేసియున్నారు. కాబట్టి … తాము తప్పించుకొనజాలని కీడు వారిమీదికి రప్పింపబోవు

చున్నాను, వారు నాకు మొఱ్ఱపెట్టినను నేను వారి మొఱ్ఱను వినకుందును (యిర్మీయా 11:8-11).

తన ప్రజలకు బురుజుగానున్న యెరూషలేము యొక్క (మరణాన్ని) నాశనాన్ని ఆయన తెచ్చినప్పుడు యిలా జరుగుతుంది: "అనేక జనులు ఈ పట్టణపు మార్గమున పోవుచు – 'యెహోవా యెందునిమిత్తము ఈ గొప్ప పట్టణమును ఈలాగు చేసెనని' యొకనినొకడు అడుగగా అచ్చటివారు – 'వీరు తమ దేవుడైన యెహోవా నిబంధనను నిరాకరించి అన్య దేవతలను పూజించి వాటికి నమస్కారము చేసినందున ఆయన ఈలాగున చేసియున్నాడని చెప్పుదురు' " (యిర్మీయా 22:8, 9).

ఇతర జనములకు (దేశములకు) ఇశ్రాయేలు పాఠం నేర్పించేదిగా ఉండి పోతుంది. విధేయత్వమును చూపవలసిన దేవుని నిబంధనను భంగం చేయడంవలన, దేవుడు వారికి వాగ్దానం చేసిన ఆశీర్వాదములు పొందకుండ తమను తామే అపాత్రులుగా చేసికొన్నారు.